## క్లుప్తంగా

### ఫొటోథెరపీ కేంద్రం ప్రారంభం



ఫొటోథెరపీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ

**సుల్తానాబాద్:** అప్పుడే జన్మించిన పిల్లలకు పచ్చ కామెర్లు ఎక్కువగా వస్తుండడంతో జిల్లా కేంద్రాలకు తరలించాల్సి వస్తోందని, ఈ మేరకు సుల్తానాబాద్ ప్రభుత్వాసుపత్రిలో శనివారం ఫొటోథెరపీ కేంద్రాన్ని ప్రారంభించినట్లు ఎంపీపీ బాలాజీరావు, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పిల్లలకు పచ్చకామెర్లు తగ్గించడానికి యంత్రం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. డాక్టర్ శ్రీధర్, కౌన్సిలర్ అనుమాల అరుణ, ఏఎంసీ మాజీ చైర్మన్ బుర్ర శ్రీనివాస్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు పురం ప్రేమ్‌చందర్‌రావు, సిబ్బంది శ్రీనివాసాచారి, నరేశ్, జుల్ఫకర్, నాయకులు బాబురావు, అరవింద్ రెడ్డి ఉన్నారు.

### లైబ్రరీకి కూలర్లు అందజేత



దాసరి ఉష అందజేసిన కూలర్లు

**పెద్దపల్లిరూరల్:** జిల్లా గ్రంథాలయానికి బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష శనివారం రెండు కూలర్లు అందజేశారు. కాగా జిల్లా గ్రంథాలయాన్ని ఆమె శుక్రవారం సందర్శించి పాఠకులు, నిరుద్యోగ యువతను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. మండుతున్న ఎండల నుంచి ఉపశమనం కలిగించాలనే ఆలోచనతో దాసరి ఉష లైబ్రరీకి రెండు కూలర్లను అందజేసినట్లు పార్టీ పట్టణ అధ్యక్షురాలు శారద చెప్పారు. నాయకులు చంద్రశేఖర్, రాజ్‌కుమార్, నరేశ్ ఉన్నారు.

### షరతులు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

**మంథని:** అకాల వర్షాలకు ధాన్యం తడిసి రైతులు ఇబ్బంది పడుతుంటే ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, ఎలాంటి షరతులు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని కాంగ్రెస్ పార్టీ అనుబంధ విభాగం కిసాన్ సెల్ జిల్లా చైర్మన్ ముస్కుల సురేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంథనిలో శనివారం ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా మొలకెత్తిన ధాన్యం తూకం వేయాలన్నారు. ప్రభుత్వం రైతులను అన్నివిధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల పక్షాన 15న పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నిరసన చేసి కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తామని తెలిపారు. రైతులు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తరలిరావాలని కోరారు.

### మూడు వార్డుల్లో బాలవికాస బోర్‌వెల్స్

**పెద్దపల్లిరూరల్:** పట్టణంలోని 3, 17, 26 వార్డుల పరిధిలో శనివారం బాలవికాస స్వచ్ఛంద సంస్థ సహకారంతో బోర్‌వెల్ పనులు చేపట్టారు. వేసవిలో ప్రజలకు నీటి ఇబ్బందులు రాకుండా చూసేందుకు వీలుగా బోర్‌వెల్ వేయించినట్టు మున్సిపల్ చైర్మన్ మమతారెడ్డి తెలిపారు. కౌన్సిలర్లు భిక్షపతి, అమ్రేశ్, సంధ్య, చిరంజీవి, కమిషనర్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

### రైతుల పాలిట దేవుడు వైఎస్సార్



ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

**పాలకుర్తి:** రైతుల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేసిన గొప్ప వ్యక్తి దివంగత నేత వైఎస్.రాజశేఖర్‌రెడ్డి అని వైఎస్సార్‌టీపీ రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జి జిమ్మిబాబు అన్నారు. పాలకుర్తి మండలంలోని కొత్తపల్లిలో శనివారం ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించి రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, మిల్లర్లు ధాన్యంలో తేమ, తాలు పేరుతో అడ్డగోలుగా కోతలు విధిస్తూ రైతులను దోచుకుంటున్నారని ఆరోపించారు. అకాల వర్షాలతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోయి రోదిస్తుంటే బీఆర్‌ఎస్ నాయకులు మాత్రం సమ్మేళనాల పేరిట ఎంజాయ్ చేస్తున్నారని దుయ్యబట్టారు. వైఎస్సార్ హయాంలో తడిసిన ధాన్యాన్ని సైతం కొర్రీలు లేకుండా కొనుగోలు చేసి రైతులను ఆదుకున్నారని గుర్తుచేశారు. ప్రస్తుతం అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం బేషరతుగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్యాంసన్, బండ సతీశ్, వెంకట్, చరణ్ పాల్గొన్నారు.

# ఒగ్గుకథ అయిలయ్య

- ఇటీవల జరిగిన జాతీయస్థాయి పోటీల్లో ప్రదర్శనకు ప్రథమ బహుమతి
- జూలైలో జరగనున్న తానా మహాసభలకు ఎంపికైన ఓదెల మండలవాసి
- చిన్నప్పటి నుంచే ఒగ్గుకథ ప్రదర్శనలు..

సండే స్పెషల్




హరిద్వార్‌లో ఒగ్గుకథ ప్రదర్శనలో అయిలయ్య, మహిళ వేషధారణలో అయిలయ్య (ఇన్‌సెట్‌లో)



జాతీయస్థాయి అవార్డు అందుకుంటున్న అయిలయ్య

**ఓదెల:** కళల్లో రాణించాలి అనే తపన ఉన్నవారు నిరంతరం శ్రమిస్తూనే ఉంటారు. విజయాన్ని ముద్దాడే వరకు తమ కళకు పదును పెడుతూ ఎల్లప్పుడూ తపన పడుతూనే ఉంటారు. ఇదే ఆశయంతో ఒగ్గుకథనే ఊపిరిగా, బతుకుదెరువుగా జీవిస్తున్న ఒక వ్యక్తి గ్రామాల్లో ఒగ్గుకథలతో, మానవనీయ కథనాలతో ప్రజలను మంత్రముగ్ధులను చేస్తూ జాతీయ స్థాయి అవార్డు అందుకోవడమే కాకుండా జూలైలో అమెరికాలో జరిగే తానా సభలకు ఎంపికయ్యాడు. చిన్నప్పుడే నేర్చుకున్న 50 ఒగ్గుకథలను ప్రదర్శిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నాడు పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం బాయమ్మపల్లె గ్రామానికి చెందిన ఒగ్గుకథ కళాకారుడు కుక్కల అయిలయ్య.

### జాతీయస్థాయిలో ప్రథమ బహుమతి

ఈనెల 5, 6, 7వ తేదీల్లో ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో జరిగిన తారా ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి పోటీల్లో అయిలయ్య పాల్గొన్నాడు. ఆయన ఒగ్గుకథ ప్రదర్శన జాతీయస్థాయిలో ప్రథమ బహుమతికి ఎంపికైంది. అక్కడి ఎమ్మెల్యే, మాజీ మంత్రి మదన్‌కౌశిక్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ పోటీల్లో మహాకుంభ నృత్యోత్సవంలో వివిధ రాష్ట్రాల నుంచి 100మంది కళాకారులతో భారతీయ సాంస్కృతిక సంప్రదాయాలను కళ్లకు అద్దినట్లు ప్రదర్శనలు ఇచ్చారు. కుక్కల అయిలయ్య ఒగ్గుకథ బృందం సభ్యులు గోదావరిఖనికి చెందిన పి.రవి, అడవిశ్రీరాంపూర్‌కు చెందిన మల్లన్న ఇచ్చిన సాంస్కృతిక ప్రదర్శనలు జాతీయ స్థాయి ఉగాది పురస్కారాల అవార్డుకు ఎంపికయ్యాయి.

### చిన్నవయసులోనే ఆకర్షితుడై..

ఓదెల మండలం బాయమ్మపల్లెకు చెందిన కుక్కల ఓదెలు–వీరమ్మ దంపతులకు చిన్న కుమారుడైన అయిలయ్య 8వ తరగతి పూర్తిచేశాడు. ఆ వయసులో ఒగ్గుకథలకు ఆకర్షితుడయ్యాడు. అదే గ్రామానికి చెందిన గురువు మద్దూరి బాలయ్య దగ్గర శిష్యరికం చేసి ప్రస్తుతం 50 వరకు ఒగ్గుకథ ప్రదర్శనలు ఇస్తున్నాడు. ఇందులో మల్లన్న, ఎల్లమ్మ, పోశమ్మ, శ్రీదేవి, పెద్దిరాజు, ముదిరాజ్ పెద్దమ్మ, చాకలి మడేలయ్య, సారంగధర, ఐదు మల్లెలపువ్వులు, గిరియవతి కథలను తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో ప్రదర్శనలు ఇచ్చి ప్రశంసలు పొందారు. దీంతో పాటు వరకట్న నిషేధం, ఎయిడ్స్ నియంత్రణ, మూఢనమ్మకాల నిర్మూలన, హరితహారం, పరిసరాల పరిశుభ్రత, మరుగుదొడ్ల వాడకం గురించి సామాజిక చైతన్యం కల్పించే కార్యక్రమాలు సైతం తనకథల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించి పౌరసంబంధాల శాఖవారిచే అవార్డులు అందుకున్నారు. జూలైలో అమెరికాలో జరిగే తానా మహాసభలకు రాష్ట్రం నుంచి ఎంపికవడం, జాతీయస్థాయి ఉగాది పురస్కారాల అవార్డుకు అయిలయ్య ఎంపికవడంపై ఓదెల మండల ప్రజలు, అభిమానులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.



ఒగ్గుకథ ప్రదర్శిస్తున్న అయిలయ్య

### ప్రభుత్వం ప్రోత్సాహం అందించాలి



చిన్నప్పటి నుంచి ఒగ్గుకథలు అంటే ప్రాణం. గురువు మద్దురి బాలయ్యతో చిన్నప్పటి నుంచి కథలకు వెళ్లి నేర్చుకున్నాను. 50కథల పైగానే తెలంగాణ, మహారాష్ట్ర కర్ణాటక రాష్ట్రాల్లో ప్రదర్శనలు ఇచ్చాను. ప్రభుత్వం మరింత పోత్సాహం ఇస్తే భారతీయ కళాప్రదర్శనలతో పాటు సాంస్కృతికతను చాటిచెప్తాను. జూలైలో అమెరికాలో జరిగే తానా సభలకు ఎంపిక కావడం సంతోషంగా ఉంది.

– అయిలయ్య, కళాకారుడు, బాయమ్మపల్లె

# గ్రామాల అభివృద్ధికి ఎస్‌డీఎఫ్ నిధులు



మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్

**ధర్మారం:** మండలంలోని గ్రామాల అభివృద్ధి కోసం మంత్రి ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి రూ.3కోట్లు కేటాయించినట్లు ధర్మారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి తెలిపారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాసూరి శ్రీధర్ అధ్యక్షతన శనివారం పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ మాట్లాడుతూ మండలంలోని 29 గ్రామపంచాయతీలకు ప్రతి గ్రామానికి రూ.10లక్షల చొప్పున ఎస్‌డీఎఫ్ నిధులు మంజూరు చేశారని, ఈ నిధులతో గ్రామంలో అభివృద్ధి పనులు పూర్తి చేయాలని సూచించారు. రైతుబంధు సమితి జిల్లా సభ్యులు పుస్కూరి రామారావు, ఎగ్గెల స్వామి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శులు దొనికెన తిరుపతి, కూరపాటి శ్రీనివాస్, అడ్వయిజరీ కమిటీ సభ్యులు కోరుకంటి స్వామి, కాంపెల్లి చంద్రశేఖర్, గందం రవీందర్, మూల మల్లేశం, పాక వెంకటేశం, బండవరం సుమన్ పాల్గొన్నారు.

# బీపీ మండల్ విగ్రహావిష్కరణకు తరలిరండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

**పెద్దపల్లిరూరల్:** ఓబీసీ రిజర్వేషన్ పితామహుడు బీపీ మండల్ యాదవ్ విగ్రహాన్ని పుట్టలింగమ్మ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో 16న మంథనిలో జెడ్పీచైర్మన్ పుట్ట మధుకర్ చేతుల మీదుగా ఆవిష్కరించనున్నట్లు యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లేశం, తిరుపతియాదవ్ తెలిపారు. పెద్దపల్లిలో శనివారం చలో మంథని పోస్టర్ ఆవిష్కరించారు. నాయకులు చిలారపు పర్వతాలు, సంపత్‌యాదవ్, ఉప్పరి శ్రీనివాస్, రాజ్‌కుమార్, నవీన్, పోచం, నర్సయ్య, రాజు, రమేశ్, నారాయణ, రవి ఉన్నారు.

**పెంచికల్‌పేటలో..**

**కమాన్‌పూర్:** 16న మంథని బీపీ మండల్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ మండలంలోని పేంచికల్‌పేట గ్రామంలో శనివారం పోస్టర్ ఆవిష్కరించారు. సర్పంచ్ కొండ వెంకటేశ్, ఎద్దు రాజయ్య పాల్గొన్నారు.

**పోస్టర్ ఆవిష్కరణ**

**కమాన్‌పూర్:** 16న మంథనిలో ఏర్పాటు చేసిన ఓబీసీ రిజర్వేషన్ల పితామహుడు బీ.పీ మండల్ విగ్రహావిష్కరణ సభను విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ రామగిరి మండల అధ్యక్షుడు శేంకేశి రవీందర్ కోరారు. మండల కేంద్రంలో శనివారం విగ్రహావిష్కరణ పోస్టర్‌ను ఆవిష్కరించారు. నాయకులు పూదరి సత్యనారాయణగౌడ్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు పాశం ఓదెలు, టీబీజీకేఎస్ ఉపాధ్యక్షులు గౌతం శంకయ్య, ఆశాకుమారి, బుద్దె ఉదయ్, ఎంపీటీసీ కామ శ్రీనివాస్, కన్నూరి శ్రీశైలం, గాజుల ప్రసాద్, మారగోని కుమారస్వామి పాల్గొన్నారు.

# కనులపండువగా హనుమాన్ శోభాయాత్ర



శోభాయాత్రలో పాల్గొన్న హనుమాన్ భక్తులు

**సుల్తానాబాద్:** పట్టణంలో శనివారం హనుమాన్ శోభాయాత్ర కనులపండువగా నిర్వహించారు. మార్కండేయ కాలనీలో ఉన్న పెరిగిద్దె హనుమాన్ల ఆలయంలో మాలధారులు ఆంజనేయ స్వామి విగ్రహానికి క్షీరాభిషేకం, రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం పట్టణంలోని పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష, గురుస్వాములు హరేందర్, శేఖర్, అనిల్, సంతోష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# కర్ణాటకలో కాంగ్రెస్ గెలుపుపై సంబరాలు



సంబరాలు జరుపుకుంటున్న కాంగ్రెస్ శ్రేణులు

**జూలపల్లి/రామగుండం/యైటింక్లయిన్‌కాలనీ/ఎలిగేడు/కమాన్‌పూర్/ఓదెల/మంథని/కాల్వశ్రీరాంపూర్/ధర్మారం:** కర్ణాటకలో కాంగ్రెస్ గెలుపుతో జిల్లావ్యాప్తంగా ఆ పార్టీ నాయకులు శనివారం సంబరాలు జరుపుకున్నారు. బాణసంచా పేల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ శకం రాబోతుందని, పార్టీకి పునర్వైభవం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## చిత్ర కథ – ప్రమాదకరంగా గుంత



**జ్యోతినగర్:** ఎన్టీపీసీ రామగుండం మేడిపల్లి రోడ్‌లోని కల్వర్టు వద్ద ప్రధాన రోడ్డులో గుంత ఏర్పడింది. దీంతో స్థానికులు వాహనదారులు ప్రమాదాలకు గురికాకుండా హెచ్చరికగా రాయిని పెట్టి సంచులు ఏర్పాటు చేశారు. సంబంధిత అధికారులు స్పందించి ఎలాంటి ప్రమాదాలు జరగకముందే గుంత పూడ్చివేయించాలని వాహనదారులు కోరుతున్నారు.

# సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న భూపాల్

**గోదావరిఖని:** కార్మికుల హక్కుల సాధన కోసం సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ రాష్ట ఉపాధ్యక్షుడు భూపాల్ కోరారు. యూనియన్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. దేశంలోని కోల్ ఇండియా, సింగరేణి, ఎన్టీపీసీ, ఎల్ఐసీ, బీఎస్ఎన్ఎల్, తదితర ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అంబానీ, ఆదానీలకు సమస్త సంపదను కట్టబెడుతోందని ఆరోపించారు. సింగరేణి కార్మికుల కోసం నిరంతరం పోరాడుతున్న సీఐటీయూ రాష్ట 16వ మహాసభలు 21, 22వ తేదీల్లో గోదావరిఖనిలో నిర్వహిస్తున్నామని, విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి, నాయకులు ఎర్రవెల్లి ముత్యంరావు, మెండె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### శ్రీనివాస్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే చందర్

**గోదావరిఖని:** ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చెరుకుతోట శ్రీనివాస్‌ను ఎమ్మెల్యే కోరుకంటి చందర్ శనివారం పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు తదితరులున్నారు.

**నేడు మాతృమూర్తుల పాద పూజోత్సవం**

ప్రపంచ మదర్ డేను పురస్కరించుకుని ఆదివారం 2023 మంది మాతృమూర్తులకు పాదపూజోత్సవం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తెలిపారు. స్థానిక జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో కార్యక్రమం ఉంటుందని, మాతృమూర్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

### సీఎం కప్ పోటీలను వినియోగించుకోవాలి

**ఓదెల:** మండలంలో 15 నుంచి 17వ తేదీ జరిగే సీఎం కప్ పోటీలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో జి.సత్తయ్య కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం కోఆర్డినేషన్ సమావేశం జరిగింది. ఎంపీడీవో మాట్లాడుతూ ఓదెల హైస్కూలు మైదానంలో జరిగే క్రీడల్లో మహిళలు, పురుషులు 15 ఏళ్ల నుంచి 36లోపు వారు మాత్రమే పాల్గొనాలని సూచించారు. వివరాలకు పీఈటీ టి.ప్రణయ్ సెల్ నంబర్ 96183 36976, విష్ణు పీఈటీ, కనగర్తి, స్వరూప పీఈటీ, కేజీబీవీ వారిని సంప్రదించాలని తెలిపారు. తహసీల్దార్ రమేశ్, ఎంఈవో ఆరెపల్లి రాజన్న పాల్గొన్నారు.

సీఎం కప్ పోటీలను విజయవంతం చేయాలి

**సుల్తానాబాద్:** సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సీఎం కప్ పోటీలు 15 నుంచి ప్రారంభమవుతాయని, క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత కోరారు. క్రీడాకారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

**నంది మేడారంలో..**

**ధర్మారం:** మండలంలోని నందిమేడారం బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలో 15, 16వ తేదీల్లో మండల స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జయశీల తెలిపారు. 15న పురుషులకు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, అథ్లెటిక్స్ పోటీలు, 16న మహిళలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలు జరుతాయని పేర్కొన్నారు. ఉదయం 8 గంటల నుంచి పోటీలు ప్రారంభమవుతాయని, ఆసక్తి గల క్రీడాకారులు ఆధార్‌కార్డు జిరాక్స్‌తో అరగంట ముందు రిపోర్టు చేయాల్సి ఉంటుందని చెప్పారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారిని జిల్లాస్థాయి పోటీలకు పంపించనున్నట్లు తెలిపారు.

### సోనీ మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి



నివాళి అర్పిస్తున్న దాసరి ఉష

**పెద్దపల్లిరూరల్:** కార్యదర్శులు సమ్మెకు దిగినా పాలకులు పట్టించుకోకపోవడంతో ఆత్మహత్యకు పాల్పడ్డ కార్యదర్శి సోని మృతికి ప్ర భుత్వమే బాధ్యత వహించాలని బీఎస్పీ నియోజ కవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష డిమాండ్ చేశారు. బస్టాండ్ వద్ద శనివారం కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. నాయకులు వెంకటేశ్, దుర్గయ్య, గోపాల్, అనిల్, రియాజ్, అరుణ, శారద, ప్రశాంత్ పాల్గొన్నారు.

### నేటి నుంచి అందుబాటులో బాడీ ఫ్రీజర్

**ఎలిగేడు:** మండల కేంద్రంలోని గ్రామపంచాయతీలో ఆదివారం నానేస్తం చారిటబుల్ ట్రస్టు, ఎలిగేడు పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఎలిగేడు ప్రజల అవసరార్థం కట్ల వెంకటరాజం జ్ఞాపకార్థం వారి కుమారులు అందజేసిన బాడీ ఫ్రీజర్ అందుబాటులోకి తేనున్నట్లు నానేస్తం చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు పెంట శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వెంగళదాస్ అశోక్ తెలిపారు.

### రేపు అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

**జూలపల్లి:** మండలంలోని తెలుకుంటలో సోమవారం డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. స్థానిక గ్రామపంచాయతీ వద్ద నిర్మించిన అంబేడ్కర్ విగ్రహావిష్కరణను మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆవిష్కరించనున్నట్లు సంఘం నాయకుడు గొడిసెల రవీందర్ కోరారు.

# పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో విద్యార్థులు, గురువులు

**మంథని:** మంథనిలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 2001–02లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు శనివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆయా ప్రాంతాలకు చెందిన పూర్వ విద్యార్థులు పాల్గొని చదువుకున్న రోజులు, గురువులు నేర్పిన జీవిత పాఠాలను నెమరు వేసుకున్నారు. ఆనాడు చదువు చెప్పిన గురువులు డా.కరుణాకర్, జిన్నా సత్యనారాయణ, కృష్ణారెడ్డి, సుబ్బారావు, దేవేందర్, చారి, చంద్రయ్య, శ్రీనివాస్, మధు, సామ్యుల్, శ్రీనివాస్, ప్రసాద్‌ను సన్మానించారు.

### కర్ణాటక ఫలితాలు రాష్ట్రంలో పునరావృతం



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

**సుల్తానాబాద్:** కర్ణాటక ఫలితాలు రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు పెట్టినా పునరావృతం కావడం ఖాయమని ఉమ్మడి జిల్లా సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు అంతటి అన్నయ్యగౌడ్, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి మినుపాల ప్రకాష్ రావు అన్నారు. సుల్తానాబాద్ మండల కేంద్రంలో శనివారం కర్ణాటక ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీకి పూర్తి మెజార్టీ రావడంతో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. నాయకులు దామోదర్ రావు, పార్టీ మండల అధ్యక్షుడు చిలుక సతీశ్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు అబ్బయ్యగౌడ్, సీనియర్ నాయకులు రామన్న, రాజలింగు, తిరుపతి, రఫీక్, కౌన్సిలర్ రాజయ్య, రాజు, మొబిన్ పాల్గొన్నారు.